
RNI No :TELTEL2022/83073

# వేద న్యూస్ దినపత్రిక

వరంగల్
సంపుటి : 3, సంచిక : 280 | శనివారం
అక్టోబర్ 11, 2025 | పేజీలు : 4
వెల : రూ.3-00



అయోమయంలో కాంగ్రెస్ కార్యకర్తలు..!

3లో..

# వనం వీడి జనంలోకి..

- లొంగిపోయిన మావోయిస్టు కీలక నేతలు
- లొంగిపోయిన మావోయిస్టులకు ప్రభుత్వం ప్రకటించిన రివార్డులు
- డీజీపీ శివధర్‌రెడ్డి వెల్లడి



**వేద న్యూస్, హైదరాబాద్ ప్రతినిధి:**

మావోయిస్టు పార్టీకి మరో ఎదురుదెబ్బ తగిలింది. తెలంగాణ రాష్ట్ర డీజీపీ శివధర్‌రెడ్డి ఎదుట మావోయిస్టు కీలక నేతలు లొంగిపోయారు. ఈ సందర్భంగా శుక్రవారం ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో డీజీపీ శివధర్‌రెడ్డి వివరాలను వెల్లడించారు. కుంకటి వెంకటయ్య అలియాస్ వికాస్, మొగిలిచర్ల వెంకట్రాజు అలియాస్ చందు, తోడెం గంగ అలియాస్ సోనీ (ఛత్తీస్‌గఢ్) మావోయిస్టు పార్టీ నుంచి బయటికొచ్చి జనజీవన స్రవంతిలో కలిసిపోయారని డీజీపీ శివధర్ రెడ్డి వివరించారు. ఈ ముగ్గురూ మావోయిస్టు పార్టీలో రాష్ట్ర కమిటీ స్థాయి నాయకులుగా ఉన్నారని తెలిపారు. సిద్దిపేట జిల్లాకు చెందిన కుంకటి వెంకటయ్య 1990లో పీడబ్ల్యూడీ ఏర్పాటు చేసిన రైతు కూలీ సభలకు హాజరై అదే ఏడాది అజ్ఞాతంలోకి వెళ్లారని శివధర్ రెడ్డి తెలిపారు. పీడబ్ల్యూడీ కమాండర్ బాలన్న ఆధ్వర్యంలో దళంలో చేరారని, ఆ తర్వాత అంచెలంచెలుగా ఎదిగి 35 ఏళ్లపాటు వివిధ హెూదాల్లో పనిచేశారని వివరించారు.



**- 11 ఏళ్ల వయసులోనే మావోయిస్టు ఉద్యమంలోకి**

హనుమకొండ జిల్లా ధర్మసాగర్ మండలం తాటికాయల గ్రామానికి చెందిన మొగిలిచర్ల వెంకటరాజు అనే వ్యక్తి 11 ఏళ్ల వయసులోనే విప్లవగీతాలకు ఆకర్షితుడై మావోయిస్టు ఉద్యమంలో చేరారు. ఈయన 1993లో నర్సంపేట దళంలో రిక్రూట్ అయి రాష్ట్రస్థాయి కమిటీలో వివిధ హెూదాల్లో పనిచేశారు. మావోయిస్టులతో వచ్చిన సైద్ధాంతిక విభేదాల కారణంగా, పోలీసులు ఇచ్చిన పిలుపును అందుకుని అతని భార్య తోడెం గంగతో కలిసి పోలీసుల ఎదుట వెంకటరాజు లొంగిపోయారు అని డీజీపీ శివధర్ రెడ్డి వెల్లడించారు. ఇటీవల కాలంలో సుమారు 403 మంది మావోయిస్టులు పోలీసులు ఎదుట లొంగిపోయారని ఆయన తెలిపారు.

## గ్రామ పంచాయతీ కార్యదర్శిపై ఏసీబీ దాడి



- ఇందిరమ్మ ఇల్లు బిల్లు క్లియరెన్స్ కొరకు లంచం డిమాండ్

**వేద న్యూస్, గంగాధర:**

గంగాధర మండలంలోని మధురానగర్ గ్రామ పంచాయతీ కార్యదర్శి అనిల్‌పై అవినీతి నిరోధక శాఖ (ఏసీబీ) అధికారులు దాడులు నిర్వహించారు. ఇందిరమ్మ ఇల్లు పథకం కింద బిల్లు విడుదల చేయడానికి లంచం తీసుకుంటున్నట్టు ఫిర్యాదు రావడంతో ఏసీబీ అధికారులు అతడిని పట్టుకున్నారు. ప్రత్యక్ష సమాచారం ప్రకారం, పంచాయతీ కార్యదర్శి అనిల్, మధురానగర్‌కు చెందిన ఓ వ్యక్తికి చెందిన ఇల్లు బిల్లు క్లియరెన్స్ కోసం రూ.10,000 లంచం డిమాండ్ చేసినట్టు తెలిపారు. బాధితుడు ఈ విషయాన్ని ఏసీబీ అధికారులకు నివేదించగా, వారు పక్కా ప్రణాళికతో మధురానగర్ పంచాయతీ కార్యాలయంలో ట్రాప్ ఏర్పాటు చేశారు. ఈ క్రమంలో కార్యదర్శి లంచం తీసుకుంటుండగా ఏసీబీ అధికారులు అతన్ని రెడ్ హ్యాండెడ్‌గా పట్టుకున్నారు. అనంతరం కార్యాలయంలో అధికారులు సోదాలు నిర్వహించి, లంచం మొత్తాన్ని, సంబంధిత రికార్డులు, పత్రాలను స్వాధీనం చేసుకున్నారు. ఈ ఘటనపై పూర్తి సమాచారం త్వరలో వెల్లడికానుంది. ప్రస్తుతం అనిల్‌ను అదుపులోకి తీసుకుని విచారణ కొనసాగిస్తున్నారు.

# ప్రధాన రోడ్లపై తప్పని తిప్పలు!

- రోడ్ల పై కూరగాయల వ్యాపారం - మార్కెట్ ఏరియా కేటాయించాలని వేడుకోలు

**వేద న్యూస్, వేములవాడ:**



రాజన్న సిరిసిల్ల జిల్లా వేములవాడ పట్టణంలో ప్రధాన రోడ్లపై ఇష్టారీతిగా జరుగుతున్న కూరగాయల వ్యాపారం స్థానికులకు, ప్రయాణికులకు నరకం చూపిస్తోంది. ముఖ్యంగా కోరుట్ల బస్టాండ్ ప్రాంతం, తెలంగాణ తల్లి విగ్రహం ప్రభుత్వ కాలేజ్ పరిసరాల్లో , బైపాస్ రోడ్లలో మధ్యలోకి విస్తరించిన కూరగా యల దుకాణాలు తీవ్ర ట్రాఫిక్ గందరగోళానికి కారణమ వుతున్నాయి. వ్యాపారులు రోడ్డు మధ్యలోనే కూరగాయల వ్యాపారం వరుసగా ఏర్పాటు చేస్తున్నారు. దీనికి తోడు రోడ్డు పక్కన కూరగాయలు కొనేందుకు వచ్చిన వ్యక్తులు అడ్డదిడ్డంగా పార్క్ చేసిన వాహనాలు తోడవడంతో, వాహనాలు కేవలం ఒకే దారిలో కదలాల్సిన పరిస్థితి ఏర్పడుతోంది. ముఖ్యంగా రద్దీ సమయాల్లో ట్రాఫిక్ పూర్తిగా స్తంభించిపోతోంది. పాఠశాలలకు, కళాశాలలకు, కార్యాలయాలకు వెళ్లే ప్రజలు నిత్యం తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. నెలలుగా ఈ సమస్య కొనసాగు తున్నప్పటికీ, మున్సిపల్ అధికారులు 'చూసీచూడనట్టుగా' వ్యవహరిస్తున్నారనే ఆరోపణలు బలంగా వినిపిస్తున్నాయి. రోడ్డు అంచుల నుంచి దాదాపు మధ్యవరకు దుకాణాలు విస్తరించడం వల్ల ప్రజల భద్రతకు ముప్పు వాటిల్లే ప్రమాదం ఉందని స్థానికులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. అత్యవసర వాహనాలు సైతం ముందుకు కదలలేని పరిస్థితి నెలకొంటోంది. ప్రజల భద్రత, సురక్షిత ప్రయాణం కంటే కూరగాయల బండ్లకే ప్రాధాన్యం ఇస్తున్నారా? అని ప్రజలు అధికారులను ప్రశ్నిస్తున్నా రు. ? క్రమబద్ధీకరణ పరిష్కారమని?"ఒకవేళ పోలీసులు, మున్సిపల్ అధికారులు స్పందించి, కూరగాయల వ్యాపారులకు క్రమబద్ధంగా ఒక మార్కెట్ ఏరియా కేటాయిస్తే ఈ ఇబ్బందులు చాలావరకు తగ్గుతాయి" అని పట్టణ ప్రజలు అభిప్రాయ పడుతున్నారు. తక్షణమే ఉన్నతాధికారులు జోక్యం చేసుకుని, రోడ్లపై ట్రాఫిక్‌ను క్రమబద్ధీకరించడానికి, వ్యాపారులకు ప్రత్యామ్నాయ స్థలాన్ని కేటాయించడానికి చర్యలు తీసుకోవాలని వేములవాడ ప్రజలు డిమాండ్ చేస్తున్నారు. ?అధికారులు స్పందిస్తారా? లేదా...? పట్టణ ప్రజలు ఎదుర్కొంటున్న ఈ తీవ్ర సమస్యపై ట్రాఫిక్, మున్సిపల్ అధికారులు ఎప్పుడు దృష్టి సారిస్తారు? ప్రజా భద్రత, ట్రాఫిక్ సాఫీగా సాగేందుకు ఎలాంటి చర్యలు తీసుకుంటారు? అనేది వేచి చూడాలి.

## అక్రమ పట్టా పై విచారణకు ఆదేశించిన జేసి



**వేద న్యూస్, కమలాపూర్ :**

హనుమకొండ జిల్లా కమలాపూర్ మండలం వంగపల్లి గ్రామానికి చెందిన వితంతు మహిళ అయినటువంటి జూపాక ఇందిరా తన భర్త కీ.శే జూపాక జలంధర్ కు వారసత్వంగా రావలసిన భూమిని అదే గ్రామానికి చెందిన జూపాక రామ్ చందర్ అనే వ్యక్తి 2018 సంవత్సరంలో ఆర్ ఓ ఆర్ చట్టం ద్వారా అక్రమంగా పట్టా చేసుకున్నాడని, ఈ విషయంపై సంబంధిత అధికారులకు ఎన్నిసార్లు మొరపెట్టుకున్న తనకు న్యాయం చేయట్లేదని ఆవేదన చెందుతున్న సదరు మహిళను చూసి చలించిపోయిన హుజురాబాద్ నియోజకవర్గం బిఆర్ఎస్ పార్టీ సీనియర్ నాయకులు తక్కళ్ల పల్లి సత్యనారాయణ రావు, కమలాపూర్ మాజీ సర్పంచ్ శనిగరపు సమ్మయ్య లు సదరు వితంతు మహిళను తన భూమికి సంబంధించిన సమస్య గురించి పూర్తి వివరాలు అడిగి తెలుసుకున్నారు. ఇంతలోనే తహసిల్దార్ కార్యాలయం తనిఖీ చేయడానికి వచ్చినటువంటి జాయింట్ కలెక్టర్ కు సదరు మహిళ భూ సమస్య గురించి తెలియజేయడంతో స్పందించిన ఆయన వెంటనే విచారణకు ఆదేశించారు. సదరు మహిళకు సంబంధించిన భూమి సమస్య గురించి, అక్రమంగా పట్టా వేరే వ్యక్తి చేసుకున్నాడు అనే ఆరోపణ అంశంపై విచారణ జరిపి తనకు 24 గంటల్లో నివేదిక అందించాలని, నిజంగానే అక్రమం జరిగిందని రుజువైతే బాధ్యులపై చర్యలు చేపట్టాలని ఆ అక్రమ పట్టాను రద్దు చేయాలని జాయింట్ కలెక్టర్ ఆదేశించారు. తన సమస్య గురించి పూర్తిగా విని స్పందించి అధికారుల దృష్టికి తీసుకెళ్లినందుకు సదరు మహిళ తక్కెళ్ల పల్లి సత్యనారాయణ రావు కు కృతజ్ఞతలు తెలిపింది. బలవంతుల పక్షాన నిలబడి బలహీనులను, దిక్కులేని వారిని దోచుకుని తినే కొందరు నాయకులు ఉన్న

మిగతా 3వ పేజీలో..

## తెలంగాణ రాజకీయాల్లో ఉద్రిక్తత

- రాజకీయాలు వేడెక్కుతున్నాయి
- ప్రభుత్వంపై ప్రతిపక్ష దాడులు తీవ్రం
- ప్రజాభిప్రాయాన్ని ఆకర్షించేందుకు పార్టీల మధ్య ఘర్షణాత్మక పోటీ



డెస్క్ : తెలంగాణలో రాజకీయ సమీకరణలు వేగంగా మారుతున్నాయి. అధికార పక్షం తన పరిపాలనా పట్టును బలంగా నిలబెట్టుకోవాలని ప్రయత్నిస్తుండగా, ప్రతిపక్షం మాత్రం ప్రజల్లో అసంతృప్తిని పెంచుతూ, అధికార వ్యతిరేక గాలిని ఎగరేయడానికి సిద్ధమౌతోంది. ముఖ్యంగా ఎన్నికల అంచనా వేళ, ప్రతి నిర్ణయం, ప్రతి ప్రకటన ఇప్పుడు రాజకీయ ప్రయోజనాల దృష్టితోనే విశ్లేషించబడు తోంది. చిన్న చిన్న పరిపాలనా తప్పిదాల్నీ ప్రతిపక్షం పెద్ద రాజకీయ ఆయుధాలుగా మలుస్తోంది. గ్రామస్థాయి నుండి శాసనసభ వరకు ఒక రాజకీయ ఉద్రిక్తత కనిపిస్తుంది. రైతుల సమస్యలపై ప్రభుత్వం ఇచ్చిన హామీలు అమలయ్యాయా అనే ప్రశ్న మళ్లీ మళ్లీ మిన్నంటుతోంది. నిరుద్యోగ భృతి ఆలస్యం, ఫీజు రీయింబర్స్‌మెంట్‌లో జాప్యం, ధాన్యం కొనుగోలులో ఏర్పడిన

మిగతా 4వ పేజీలో..

## నల్గొండలో గిరిజన రైతుపై అమానుషం

- థర్డ్ డిగ్రీతో మానవ హక్కులు ఉల్లంఘన
- థర్డ్ డిగ్రీతో మనుష్యత్వానికి మచ్చ
- విచారణ పేరుతో పోలీసుల థర్డ్ డిగ్రీ ఆరోపణలు
- మానవ హక్కుల కమిషన్ తక్షణ చర్య



డెస్క్ :నల్గొండ జిల్లాలో జరిగిన సంఘటన రాష్ట్రవ్యాప్తంగా కలకలం రేపింది. దామరచర్ల మండలం వాడేపల్లి గ్రామానికి చెందిన గిరిజన రైతు సాయి సిద్దుపై పోలీసులు అమానుషంగా ప్రవర్తించారని ఆరోపణలు వినిపిస్తున్నాయి. యూరియా ఎరువుల కోసం రైతులు ధర్నా చేశారు. వ్యవసాయం కోసం

మిగతా 4వ పేజీలో..

వేద న్యూస్

శనివారం అక్టోబర్ 11, 2025

## బీసీ రిజర్వేషన్లకు చట్టబద్ధత కల్పించాలి



– గొనేల విజేందర్

**వేద న్యూస్, హన్మకొండ:**

బీసీలకు జీవో ద్వారా కాకుండా చట్టబద్ధత కల్పించాకే బీసీ రిజర్వేషన్లు అమలు చేయాలని ముదిరాజ్ మెపా హనుమకొండ జిల్లా ఉపాధ్యక్షుడు గొనేల విజేందర్ రాష్ట్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఆయన శుక్రవారం ఓ ప్రకటన విడుదల చేశారు. ఎన్నికల ముందు కామారెడ్డిలో కాంగ్రెస్ పార్టీ బీసీ రిజర్వేషన్లకు చట్టబద్ధత కల్పిస్తామన హామీ ఇచ్చిందని, కానీ ఇప్పుడెందుకు చట్టబద్ధత కల్పించడం లేదు అని ప్రశ్నించారు. బీసీ బిల్లు కు చట్టసభల్లో ఆమోదం తెలిపిన, గవర్నర్ వద్ద పెండింగ్లో ఉండగా జీవో ఎందుకు తెచ్చారని, ఇప్పుడు హైకోర్టు కూడా ఇదే ప్రశ్న అడుగుతుందని పేర్కొన్నారు. ఈ వ్యవహారం అంతా బీహార్ ఎన్నికల్లో గట్టెక్కెందకు, తెలంగాణ బీసీ సమాజాన్ని మోసం చేయడానికి రాష్ట్ర ప్రభుత్వం ఆడుతున్న డ్రామ అని అర్థం చేసుకోవచ్చును.బీసీ లకు 42 శాతం జీవో అనేది గాలిలో దీపమే అని, ఇది ఎన్ని రోజులు నిలకడగా ఉండదని, మహారాష్ట్ర పరిస్థితులే ఇక్కడ నెలకొట్టే దానికి ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నే పూర్తి బాధ్యత వహించి, ముఖ్యమంత్రి పదవికి రాజీనామా చేసి, బీసీ సమాజానికి బహిరంగ క్షమాపణ చెప్పాలన్నారు. బీసీ సమాజం పక్షాన డిమాండ్ చేయడం జరుగుతుందని అన్నారు. లేకుంటే నిరాహార దీక్షలు మరియు బీసీ ఉద్యమం అన్ని సంఘాల నుండి ఒక్కటై ఉద్యమం మొదలవుతుంది పేర్కొన్నారు.

## బీసీ రాజ్యాధికారం నెలకొల్పే దిశగా అడుగులు

**వేద న్యూస్, జగిత్యాల :**

జగిత్యాల జిల్లా మెట్ పల్లి పట్టణంలోని పాత బస్టాండ్ శాస్త్రి చౌరస్తా వద్ద ప్రజాసేన పార్టీ అధ్యక్షులు ఆకుల హనుమండ్లు ఆధ్వర్యంలో తెలంగాణ రాజ్యాధికార పార్టీ తీన్మార్ మల్లన్నకు మద్దతు తెలుపుతూ జాతీయ రహదారిపై నల్ల బ్యాడ్జీలు ధరించి నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా ఆకుల హన్మాండ్లు మాట్లాడుతూ రెడ్డీలు, రావులు అనాదిగా బీసీ ప్రజలను మోసం చేస్తూనే వస్తున్నారని బీసీలను అడ్డం పెట్టుకొని ప్రభుత్వాలు నెలకొల్పి బీసీలను పట్టించుకోవడం లేదని అన్నారు.బీసీ రాజ్యం రావాలంటూ బీసీ ప్రజలు ఎస్సీ,ఎస్టీ, మైనారిటీలను కలుపుకొని త్వరలో రాజ్యధికారం స్థాపించబోతున్నామని అన్నారు. తీన్మార్ మల్లన్న సారాద్యంలో తెలంగాణ రాజ్యాధికార పార్టీకి ప్రజాసేన పార్టీ తరఫున పూర్తి మద్దతు పలుకుతున్నట్లు ఆకుల హనుమాన్లు ప్రకటించారు. బీసీ రాజ్యాధికారం నెలకొల్పే దిశగా అడుగులు వేస్తున్నామని రానున్న అసెంబ్లీ ఎన్నికలలో తీన్మార్ మల్లన్న విజయ బావుట ఎగురవేస్తారని హనుమండ్లు ఆశాభావం వ్యక్తం చేశారు.

## బీసీ రిజర్వేషన్ బిల్లును కేంద్రం అడ్డుకోవడం న్యాయమేనా



**వేద న్యూస్,శాయంపేట:**

కేంద్ర ప్రభుత్వం తక్షణమేబీసీల 42 శాతం రిజర్వేషన్ బిల్లును అమలు చేయాలనిశాయంపేట మండల కేంద్రంలో తెలంగాణ కమ్యూనిస్టు పార్టీ ఆఫ్ ఇండియా రాష్ట్ర సహాయ కార్యదర్శి వంగర సాంబయ్య అన్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఈ డబ్ల్యూ ఎస్ 10శాతం రిజర్వేషన్ ఇచ్చినప్పుడే 60 శాతానికి రిజర్వేషన్లు చేరాయని ప్రపంచంలోనే అతిపెద్ద ప్రజాస్వామ్యం అని గొప్పగా చెప్పుతున్న మనము ప్రజాస్వామ్య స్ఫూర్తికి విరుద్ధంగా ఆరు శాతం ఉన్న అగ్రకులాలకు ఏలాంటి కమిషన్ లేకుండా ఏ పోరాటం చేయకుండానే బంగారం పళ్లెంలో 10శాతం రిజర్వేషన్లు అనాలోచితంగా అమలు చేశారని అన్నారు. మనకు స్వాతంత్రం వచ్చి 75 సంవత్సరాల లో విద్యా ఉద్యోగం రాజకీయాలలో బీసీలకు అవకాశం దక్కకుండా అడ్డుకోవడం ఇది న్యాయమేనా అని వారు ప్రశ్నించారు. బీసీలకు అన్ని రాజకీయ పాలిత పార్టీలు ద్రోహము చేస్తున్నాయని తెలిపారు. భారతదేశంలో బీసీలందరూ ఏకతాటిపై రావాలని భవిష్యత్తులో ద్రోహం చేసిన పార్టీలను భూస్థాపితం చేయాలని వారు డిమాండ్ చేశారు. ఇప్పటికైనా రిజర్వేషన్ పెంపును తొమ్మిదో షెడ్యూల్లో చేర్చేందుకు రాజ్యాంగ సవరణ చేస్తూ తక్షణమే పార్లమెంటును సమావేశపరచాలని అన్నారు.

## రాజన్న లడ్డు వివాదంపై స్పందించిన ఈవో

**వేద న్యూస్, వేములవాడ:**



రాజన్న సిరిసిల్ల జిల్లా వేములవాడ దక్షిణకాశీగా పేరుగాంచిన శ్రీ రాజరాజేశ్వర స్వామి వారి లడ్డూలు దుర్వాసన వస్తున్నాయని ఆయా మాధ్యమాల్లో వైరల్ గా మారిన వార్తలను భక్తులెవరు విశ్వసించవద్దని ఆలయ ఈవో రమాదేవి స్పష్టం చేశారు. లడ్డు వివాదంపై ఆలయ ఈవో క్లారిటీ ఇచ్చారు. భక్తులు కొనుగోలు చేసిన లడ్డూల నుంచి ఎలాంటి దుర్వాసన వెదజల్లడం లేదని, కేవలం విక్రయ కేంద్రం బయట ఉన్న పాత లడ్డు డబ్బాల నుండి వస్తున్న వాసనను భక్తులు లడ్డూల నుండి వస్తున్నట్టు పొరపాటు పడినట్లు ప్రాథమికంగా అంచనా వేసినట్లు తెలిపారు. ఈ విషయంపై పూర్తి స్థాయిలో విచారణ చేస్తామని అన్నారు. కొంతమంది ఉద్దేశపూర్వకంగానే ఆలయ ప్రతిష్ఠ దెబ్బతీయాలనే కోణంలో ఇలాంటి చర్యలకు పాల్పడుతున్నట్లు తమ దృష్టికి వచ్చిందని, ఇలాంటి చర్యల వల్ల భక్తుల మనోభావాలు దెబ్బతింటాయని ఆవేదన వ్యక్తం చేశారు..లడ్డూల అంశాన్ని ఉన్నతాధికారుల దృష్టికి తీసుకు వెళ్లడం తో పాటుగా లడ్డూల నాణ్యత ప్రమాణాల కొలమానం కొరకు ఫుడ్ సేఫ్టీ అధికారులకు పంపించనున్నట్లు తెలిపారు. ఆలయ అభివృద్ధి పనులు జోరందుకున్న నేపథ్యంలో ఆలయ ప్రతిష్ఠను, భక్తుల మనోభావాలను దెబ్బతీసేలా ఎవరు వ్యవహరించవద్దని ఈవో విజ్ఞప్తి చేశారు.

## 13న చలో కలెక్టరేట్ కు తరలిరావాలి

– కందుకూరి సోమన్న మాదిగ



**వేద న్యూస్, హన్మకొండ:**

సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తి బీ ఆర్ గవాయి పైన దాడి చేసిన వ్యక్తి పై దేశద్రోహం కేసు నమోదు చేసి కఠినంగా శిక్షించాలని ఎమ్మార్పీఎస్ హనుమకొండ జిల్లా ఇన్చార్జి కందుకూరి సోమన్న మాదిగ డిమాండ్ చేశారు. శుక్రవారం ఏకాశిల పార్క్ లో ఎమ్మార్పీఎస్ జిల్లా అధ్యక్షులు గద్దల సుకుమార్ మాదిగ అధ్యక్షతన జరిగిన ఎమ్మార్పీఎస్,ఎంఎస్పి అనుబంధ సంఘాల ముఖ్య నాయకుల సమావేశంలో ముఖ్య అతిథిగా కందుకూరి సోమన్న మాదిగ హాజరై మాట్లాడారు. ఈ దేశ అత్యున్నత న్యాయ స్థానంలో ప్రధాన న్యాయమూర్తిగా ఉన్న బిఆర్ గవాయి పైన దాడి జరగడాన్ని తాము తీవ్రంగా ఖండిస్తున్నట్లు తెలిపారు. బిఆర్ గవాయి ఒక దళిత బిడ్డ కాబట్టి ఆయనపై జరిగిన దాడిని యావత్తు దేశంలో ఉన్న దళిత సమాజం పైన న్యాయ వ్యవస్థ మీద భారత రాజ్యాంగం మీద జరిగిన దాడిగా తాము భావిస్తున్నామని అన్నారు. బిఆర్ గవాయి దళితుడు కాబట్టే దళితులు మమ్మల్ని ఏం చేయలేరు అనే అహంకారం ఆ దాడి చేసిన లాయర్ లో ఉంది కాబట్టే కోర్టు హాలు అని చూడకుండా ఈ దేశ అత్యున్నత న్యాయస్థానంలో ప్రధాన న్యాయమూర్తిగా ఉన్నాడని కూడా లెక్క చేయకుండా తన కాలికి ఉన్న బూటును తీసి గవాయి పైన విసిరాడని ఇది ముమ్మాటికి అహంకార చర్య అని అన్నారు. 79 సంవత్సరాల స్వతంత్ర భారతదేశంలో ఒక దళితుడు ఈ దేశ సర్వోన్నత న్యాయస్థానంలో ప్రధాన న్యాయమూర్తి అవడాన్ని జీర్ణించుకోలేక తప్పుడు కారణాలు చూపిస్తూ ఆ లాయర్ దాడి చేశాడని దాడి వెనుక కుల అహంకారం కనిపిస్తుందని కుల అహంకారంతో దాడి చేసిన ఆ వ్యక్తి పైన దేశద్రోహం కేసు నమోదు చేసి దాడి చేసిన లాయర్ ను కఠినంగా శిక్షించాలని డిమాండ్ చేశారు. పద్మశ్రీ మందకృష్ణ మాదిగ ఆదేశాల మేరకు గవాయి పైన జరిగిన దాడిని నిరసిస్తూ ఎమ్మార్పీఎస్ ఆధ్వర్యంలో నిరసన కార్యక్రమాలు చేపడతామని అందులో భాగంగా ఈనెల 13న జిల్లా కలెక్టరేట్ ముట్టడి నిర్వహిస్తామని అన్నారు. ఈ యొక్క కలెక్టరేట్ కార్యక్ర మంలో ప్రతి దళిత బిడ్డ సంఘాల కతీతంగా సోమవారం కలెక్టర్ కార్యాలయం ఎదుట ఎమ్మార్పీఎస్ ఆధ్వర్యంలో చేపట్టబోయే నిరసన కార్యక్రమానికి వందలాదిగా తరలివచ్చి గవాయికి మద్దతుగా నిలబడాలని విజ్ఞప్తి చేశారు.

ఈ కార్యక్రమంలో ఎంఎస్పి జిల్లా అధ్యక్షులు బండారి సురేందర్ మాదిగ , ఎంఎస్పి జిల్లా అధికార ప్రతినిధి గంగారపు శ్రీనివాస్ మాదిగ , ఎంఎస్పి సీనియర్ నాయకులు అక్కేనకుంట వెంకటస్వామి మాదిగ , ఎమ్మెస్ పి జిల్లా ప్రధాన కార్యదర్శి

బొక్కల నారాయణ మాదిగ ,ఎమ్మార్పీఎస్ జిల్లా ప్రధాన కార్యదర్శులు బొడ్డు శాంతి సాగర్ మాదిగ , అంకిల్ల రాజు మాదిగ ,ఎంఎస్పి జిల్లా ఉపాధ్యక్షులు రాజారపు బిక్షపతి మాదిగ , చిలువేరు సంపత్ మాదిగ ,మాట్లా వెంకటస్వామి మాదిగ ,ఎమ్మెస్పి జిల్లా కార్యదర్శులు శనిగరపు రవీందర్ మాదిగ ,తిప్పారపు మల్లేశం మాదిగ ,ఎమ్మార్పీఎస్ జిల్లా కార్యదర్శి మంద స్వరాజ్ మాదిగ, ఎమ్మార్పీఎస్ వివిధ మండలాల అధ్యక్షులు , ఉపాధ్యక్షులు నద్దునూరి రఘు మాదిగ, బొక్క రాజేష్ మాదిగ ,రేణుకుంట్ల రాజేందర్ మాదిగ , ఆర్షం సుధాకర్ మాదిగ, ఎర్ర రాము మాదిగ, ధర్మ సాగర్ మండల అధ్యక్షులు మాచర్ల బాబు తదితరులు పాల్గొన్నారు.

## డీఎస్సీ 2024 టీచర్ల వార్షికోత్సవ సంబరాలు

**వేద న్యూస్, వరంగల్ ప్రతినిధి:**



డీఎస్సీ 2024 ద్వారా ప్రభుత్వ ఉపాధ్యాయులుగా ఎంపికైన టీచర్లు సర్వీస్లో చేరి సంవత్సరం అయిన సందర్భంగా సంబరాలు జరుపుకున్నారు. నల్లబెల్లి మండలంకి చెందిన డీఎస్సీ– 20 24 ఉపాధ్యాయులు పాఠశాల పని వేళలో ముగిసిన అనంతరం సంబరాలు నిర్వహించుకున్నారు. లక్షల మంది అభ్యర్థులు పోటీపడిన డీఎస్సీలో అత్యంత ప్రతిభ కనబరిచి ఉపాధ్యాయ ఉద్యోగం సాధించిన ఉపాధ్యాయులు ఒక సంవత్సర కాలంగా ప్రభుత్వ పాఠశాలను విద్యార్థులకు విద్యాబోధనలో తనదైన పాత్రను పోషించారు. రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా ప్రవేశపెట్టిన బడిబాట ఎఫ్ఎల్ఎన్ లాంటి విద్య అభివృద్ధి కార్యక్రమాల్లో సీనియర్ ఉపాధ్యాయులతో కలిసి చురుకైన పాత్రను పోషించారు. విద్యా బోధనలో ప్రభుత్వ మార్గదర్శకాలు, అధికారుల పర్యవేక్షణ, సీనియర్ ఉపాధ్యాయుల సూచనలు పరిగణలోకి తీసుకొని విద్యా బోధనలో వీరు తమదైన చురుకైన పాత్రను పోషిస్తున్న తీరును ఒకరినొకరు అభిప్రాయాలుగా వెలిబుచ్చుకున్నారు. అనంతరం ప్రభుత్వ పాఠశాలలో చదివే విద్యార్థుల అభ్యున్నతికి కృషి చేస్తామని, వారిలో సత్ప్రవర్తన పెరిగేలా పాటుపడతామని, ప్రభుత్వ పాఠశాల విద్యార్థులు ప్రతిభావంతులైన పౌరులుగా తీర్చిదిద్దే కార్యాన్ని నెరవేరుస్తామని, ప్రభుత్వ పాఠశాలల అభివృద్ధికి నిర్విరామంగా కృషి చేస్తామని ప్రతిజ్ఞ చేశారు. ఈ సంబరాల కార్యక్రమానికి పిఆర్టియు టీఎస్ వరంగల్ జిల్లా ప్రధాన కార్యదర్శి నకిరెడ్డి మహేందర్, పి ఆర్ టి యు మండల అధ్యక్షుడు ఉడత రాజేందర్, ప్రధాన కార్యదర్శి బానోతు కృష్ణ, తెలంగాణ ప్రాంత ఉపాధ్యాయ సంఘం మండల బాధ్యులు శేఖర్, గిరిధర్, శ్రీనివాస రాజు, సీనియర్ ఉపాధ్యాయులు రామ్మూర్తి, శ్రీదేవి, కళావతి, కూనమల్ల రాజన్ బాబు, టి అనూష, కె అనిత, ఎం అనుష, యు. అనిత, మనోజ, భాగ్యశ్రీ, రజిత, శోభా, శ్రీలత, విజేత, ప్రవీణ్, తదితరులు పాల్గొన్నారు.

## బీజేపీ, బీఆర్ఎస్ లు బీసీలకు వ్యతిరేక పార్టీలు..!

**వేద న్యూస్, శాయంపేట:**

న్యాయస్థానాల నుండి ఎలాంటి స్పందన ఉన్నా బీసీలకు 42 శాతం రిజర్వేషన్లు ఇస్తామని ఇచ్చిన హామీపై కాంగ్రెస్ పార్టీ కట్టుబడి ఉందని ఆ పార్టీ మండల అధ్యక్షుడు దూదిపాల బుచ్చిరెడ్డి అన్నారు. శుక్రవారం మండలంలోని కొప్పుల, జోగంపల్లి, పెద్ద కొడెపాక, గోవిందపూర్ ,హుస్సేన్ పల్లి ,పత్తిపాక గ్రామాలలో ముఖ్య కార్యకర్తలతో సమావేశాలు నిర్వహించారు. ఈ క్రమంలో కేంద్రం ఓటు చోరికి పాల్పడుతుందని ప్రజల సంతకాలను సేకరించారు. ఈ సందర్భంగా ఆయా గ్రామాలలో బుచ్చిరెడ్డి మాట్లాడుతూ రాష్ట్రంలో కాంగ్రెస్ పార్టీ శాస్త్రీయంగా కులగణన చేసి, బీసీలకు 42 శాతం రిజర్వేషన్ అమలు చేయాలని, శాసనసభలో బిల్లు పాస్ చేయించి గవర్నర్, రాష్ట్రపతికి పంపిస్తే బిజెపి అడ్డుకుందని ఆరోపించారు. అలాగే 2019 స్థానిక సంస్థల ఎన్నికలలో బీసీల రిజర్వేషన్లను అప్పటి బీఆర్ఎస్ ప్రభుత్వం 50 శాతం మించకుండా కుదించిందని అన్నారు. ఎన్నికల అనంతరం బీఆర్ఎస్ కులగనన చేసి రిజర్వేషన్లు పెంచాల్సి ఉండగా ఎందుకు పెంచలేదో బీసీలకు సమాధానం చెప్పాలని డిమాండ్ వారు చేశారు. బిజెపి, బీఆర్ఎస్ లు బీసీల వ్యతిరేక పార్టీలుగా మిగిలిపోయాయని అన్నారు. కేంద్రంలో ఉన్న బిజెపి అధికార దుర్వినియోగానికి పాల్పడుతూ ఓటు చోరీ చేస్తుందని, ఓటు చోరి ఆపాలంటూ రాహుల్ గాంధీ గారు చేస్తున్న ఓటు చోరీ పోరాటానికిమద్దతుగా ప్రజల వద్ద సంతకాలను సేకరించారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు పోలేపల్లి శ్రీనివాస్ రెడ్డి, మారేపల్లి రవీందర్, చిందం రవి, చిట్టి రెడ్డి రాజిరెడ్డి ,డిటి రెడ్డి, సామల మధుసూదన్ ,నిమ్మల రమేష్, వైనాల కుమారస్వామి ,హైదర్ ,కుమారస్వామి,వెంకట్ ,రాజిరెడ్డి ,ఏరుకొండశంకర్ ,కొమ్ములసదానందం, పైడి ,బిక్షపతి ,భద్రయ్య ,నరేష్ రెడ్డి , నాయకులుతదితరులు పాల్గొన్నారు.



# అయోమయంలో కాంగ్రెస్ కార్యకర్తలు..!

## – కరీంనగర్ అసెంబ్లీ నియోజకవర్గ ఇన్చార్జి నియామకం ఎప్పుడు?

**వేద న్యూస్, కరీంనగర్:**

కరీంనగర్ జిల్లా కాంగ్రెస్ పార్టీలో ప్రస్తుతం ఒకరకమైన నిశ్శబ్దం, ఆందోళన కలగలిసిన వాతావరణం నెలకొంది. రాష్ట్రంలో కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చిన ఉత్సాహం పూర్తిగా స్థానిక సంస్థల ఎన్నికల సన్నాహాలపై దృష్టి సారించకుండా, నియోజకవర్గ స్థాయి ఇన్‌ఛార్జిల నియామకంపై నెలకొన్న అనిశ్చితి కార్యకర్తలను తీవ్ర నిరాశకు గురిచేస్తోంది. పార్టీ పటిష్టతకు కీలకమైన సమయంలో, నాయకత్వ లేమి వల్ల స్థానిక సంస్థల ఎన్నికల్లో పట్టు కోల్పోతామన్న ఆందోళన స్థానిక కేడర్‌లో స్పష్టంగా కనిపిస్తోంది. ?ఇన్‌ఛార్జి నియామకమే అసలు సమస్య ?ముఖ్యంగా కరీంనగర్ అసెంబ్లీ నియోజకవర్గంలో ఇన్‌ఛార్జి లేకపోవడం కార్యకర్తల నిరాశకు ప్రధాన కారణం. పార్టీని ముందుకు నడిపించే, సమన్వయం చేసే నాయకత్వం లేకపోవడంతో, ప్రభుత్వ పథకాల ప్రచారం, సంస్థాగత నిర్మాణం మందకొడిగా సాగుతున్నాయని స్థానిక నాయకులు వాపోతున్నారు.

కొంతకాలంగా, వెలిచాల రాజేందర్ రావు కి కరీంనగర్ అసెంబ్లీ నియోజకవర్గ ఇన్‌ఛార్జి పదవి దక్కుతుందని కార్యకర్తలు బలంగా ఆశించారు. రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి దీనికి ఆమోదం లభించినప్పటికీ, పీసీసీ అధ్యక్షుడి వద్ద ఈ నియామకం ఆగిపోయిందన్న ప్రచారం జిల్లా రాజకీయాల్లో ప్రధాన చర్చనీయాంశంగా మారింది.



సాధారణంగా, అధికారంలోకి వచ్చిన కొత్తలో పార్టీలో ఇటువంటి నియామకాల ప్రక్రియ కాస్త ఆలస్యం అవ్వడం సహజం. అయితే, ఈ జాప్యానికి అనేక కారణాలు ఉండవచ్చు. ఎమ్మెల్యేలు, మంత్రులుగా ఉన్న నేతలందరికీ సహకారం అందించే సమన్వయ కమిటీల ఏర్పాటుపై దృష్టి పెట్టడం..స్థానిక సంస్థల ఎన్నికలు ఎప్పుడు జరుగుతాయనే దానిపై ప్రభుత్వం స్పష్టత ఇచ్చేంత వరకు నియామకాలు ఆపడం అయితే కరీంనగర్ వంటి కీలకమైన స్థానానికి ఒకరి కంటే ఎక్కువ మంది ఆశావహులు ఉండటం లేదా బలమైన నాయకుడిని ఎంచుకునే విషయంలో అధిష్టానంలో ఇంకా ఏకాభిప్రాయం కుదరకపోవడం ఆందోళనను కలిగిస్తుంది.

వెలిచాల రాజేందర్ రావు నియామకం విషయంలో జాప్యం వెనుక కూడా బలమైన అంతర్గత రాజకీయ కారణాలు ఉండవచ్చు. అయినప్పటికీ, ఈ జాప్యం వల్ల పార్టీ సంస్థాగత నిర్మాణం దెబ్బతింటుంది, ఇది రాబోయే స్థానిక ఎన్నికల్లో కాంగ్రెస్ పట్టు కోల్పోయే ప్రమాదాన్ని పెంచుతుంది. కార్యకర్తల ఆందోళనను దృష్టిలో ఉంచుకుని, వెలిచాల రాజేందర్ రావు కి ఇన్‌ఛార్జి పదవి దక్కుతుందా? లేదా? అనే అంశంపై త్వరలోనే కాంగ్రెస్ అధిష్టానం ఒక స్పష్టమైన నిర్ణయం తీసుకోవాల్సి ఉంది. ఈ నియామకపు గందరగోళానికి తెరపడితేనే, ఉమ్మడి కరీంనగర్ జిల్లాలో కాంగ్రెస్ పార్టీ పూర్తిస్థాయిలో స్థానిక ఎన్నికల యుద్ధానికి సిద్ధమవుతుంది. లేదంటే, పార్టీ పటిష్టం లేకపోవడం వల్ల ప్రతిపక్షాలకు మరింత బలం చేకూరే అవకాశం ఉంది.

# అక్రమ పట్టా పై విచారణకు ఆదేశించిన జేసి

ఈ రోజుల్లో ఏ దిక్కు మొక్కు లేని ఒక వితంతు మహిళ భూమికి సంబంధించిన సమస్య తో ఇబ్బందులు పడుతుంది అని చూసిన వెంటనే స్పందించి తనకు న్యాయం జరిగేందుకు అధికారుల దృష్టికి తీసుకెళ్లడం పరిష్కారానికి కృషి చేయడం అనేది నిజంగా గొప్ప విషయం. నాయకుడంటే తనకున్న పలుకుబడిని పరపతిని స్వలాభం కోసం ఉపయోగించుకోకుండా బాధితుల పక్షాన నిలబడుతూ వారికి న్యాయం చేయడానికి కృషి చేయడం అసలైన నాయకుని యొక్క నిజమైన లక్షణం అని పలువురు తమ అభిప్రాయాన్ని తెలియజేస్తూ ఒక వితంతు మహిళ సమస్య పరిష్కారానికి తోడ్పాటు అందించడం పట్ల తక్కళ్ల పల్లి సత్యనారాయణ రావుకు అభినందనలు తెలిపారు.

# పద్మశాలి యువసేన సహకార పరపతి సంఘం అధ్యక్షుడుగా వనం దేవరాజు

**వేద న్యూస్,శాయంపేట:**




పద్మశాలి యువసేన సహకార పరపతి సంఘం అధ్యక్షులు వడ్డేపల్లి శ్రీనివాస్ అధ్యక్షతన 18వ వార్షికోత్సవం సర్వసభ్య సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సమావేశము నందు అంశములు చర్చించి తీర్మానించారు.సభ్యులందరూ లెక్కలు పరిశీలించి ఆమోదించారు. నూతన కమిటీ ఎన్నిక గౌరవ అధ్యక్షులు వడ్డేపల్లి శ్రీనివాస్ అధ్యక్షతన వనం దేవరాజు ను నూతన అధ్యక్షుడు గా ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఉపాధ్యక్షులుబాసని బాలకృష్ణ, ప్రధానకార్యదర్శి మంత్రి రమేష్ బాబు,కోశాధికారి సామల క్రాంతి కుమార్ సహాయ కార్యదర్శి కోమటి శేఖర్, డైరక్టర్ లుగా గొట్టిముక్కుల రాజు, వలుపదాసు సాంబయ్య, బాసని రాజు , ములుకుంట్ల సదానందం, కడారి చంద్రమౌళి, సలహా కమిటీ నీ వలుపదాసు చంద్రమౌళి, బూర లక్ష్మినారాయణ ,బాసని ప్రకాష్ ,గొట్టిముక్కుల రామ్మూర్తి, తుమ్మ ప్రభాకర్ ఈ కమిటీని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఈ ఎన్నిక సహకరించిన పద్మశాలి యువసేన సహకార పరపతి సంఘం కు నూతన అధ్యక్షుడు వనము దేవరాజు కృతజ్ఞతలు తెలిపారు.

# నాణ్యమైన రేషన్ బియ్యం అందడం లేదని ఫుడ్ కమిషన్ చర్యలు

**వేద న్యూస్, ఇల్లంతకుంట:**

రాజన్న సిరిసిల్ల జిల్లా, ఇల్లంతకుంట మండలం, పెద్దలింగాపూర్ గ్రామ ప్రజలకు రేషన్ షాపు ద్వారా నాణ్యమైన సన్న బియ్యం అందడం లేదన్న ఫిర్యాదుపై తెలంగాణ రాష్ట్ర ఫుడ్ కమిషన్ స్పందించింది. కమిషన్ సభ్యులు ఓరుగంటి ఆనంద్ ఈ అంశంపై కేసు నమోదు చేసి, వెంటనే చర్యలు తీసుకోవాలని జిల్లా అధికారులను ఆదేశించారు. పెద్దలింగాపూర్ గ్రామ హక్కుదారులు చేసిన ఫిర్యాదును స్వీకరించిన అనంతరం, మెంబర్ ఓరుగంటి ఆనంద్%‰% రాజన్న సిరిసిల్ల జిల్లా కలెక్టర్‌కు లేఖ రాశారు. ఈ అంశంపై డి జి ఆర్ ఓ (డిప్యూటీ రిజిస్ట్రార్ ఆఫ్ ఆఫీసర్స్) ద్వారా తక్షణమే విచారణ జరిపించాలని ఆదేశించారు.ముఖ్యంగా, రేషన్ షాపులో ఉన్న పాడైపోయిన బియ్యాన్ని వెంటనే వాపస్ తీసుకొని, వాటి స్థానంలో నాణ్యమైన సన్న బియ్యాన్ని సరఫరా చేయాలని ఆదేశాలలో పేర్కొన్నారు. ప్రజా పంపిణీ వ్యవస్థ (పిడిఎస్) ద్వారా ప్రజా హక్కును కాపాడటానికి సివిల్ సప్లయర్స్ గోదాము నుండి నేరుగా ప్రజలకు నాణ్యమైన సన్న బియ్యం పంపిణీ అయ్యేలా అవసరమైన చర్యలు తీసుకోవాలని ఆదేశించారు.ఈ చర్యల అమలుపై తీసుకున్న వివరాలతో కూడిన నివేదికను 10 రోజుల లోగా రాష్ట్ర ఫుడ్ కమిషన్ కార్యాలయానికి పంపించాలని జిల్లా కలెక్టర్‌ను


తేది: 10-10-2025

మెంబర్ ఓరుగంటి ఆనంద్ ఆదేశించారు.

# వ్యతిరేకత ఉందనే వెనుకడుగేసిన కాంగ్రెస్..!



**వేద న్యూస్, చొప్పదండి రామడుగు:**

నిన్న మొన్నటి వరకు ఎన్నికల డ్రామా నిర్వహించిన కాంగ్రెస్ ప్రభుత్వం ప్రజల్లో వ్యతిరేకత ఉందనే సమాచారంతో ఎన్నికలను వాయిదా వేసిందని బీజేపీ రాష్ట్ర కార్య వర్గ సభ్యులు మేకల ప్రభాకర్ యాదవ్ విమర్శించారు. ఈ మేరకు శుక్రవారం మండల కేంద్రంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. ఎన్నికలు నిర్వహిస్తున్నట్టు నటించిన కాంగ్రెస్ తిరిగి వారి అనూయు లతోనే కేసు వేయించి ప్రజల్ని మోసం చేస్తున్నారని ఆయన ఆరోపించారు. బీసి ల రిజర్వేషన్ అమలుకు అన్ని పార్టీల వారు కలిసి రావాలని చెప్పిన మంత్రి పొన్నం ప్రభాకర్ మళ్ళీ బీసీ ల కోసం ఒక్క కాంగ్రెస్ పార్టీ మాత్రమే పోరాడుతుందని చెప్పడం హాస్యస్పదమన్నారు. బీసీల అభ్యున్నతికి బీజేపీ ఇప్పటికీ కట్టుబడి ఉందని ప్రభాకర్ స్పష్టం చేశారు.

# న్యాయాన్ని కాపాడండి..రిజర్వేషన్లు అమలు చేయండి

**వేద న్యూస్, కేయూ క్యాంపస్:** – పాస్ రాష్ట్ర అధ్యక్షులు డాక్టర్ సంగని మల్లేశ్వర్

భారత రాజ్యాంగ ప్రవేశిక ప్రజలందరికి సామాజిక,ఆర్థిక, రాజకీయ న్యాయం అందాలని ప్రవచించిన అత్యున్నత న్యాయ స్థానాల్లో నియమితులైన న్యాయమూర్తుల్లో సామాజిక న్యాయం కొరవడి అట్టడుగు వర్గాలకు న్యాయం జరగడంలేదని పూలే ఆశయ సాధన సమితి అధ్యక్షులు (పాస్) రాష్ట్ర అధ్యక్షులు డాక్టర్ సంగాని మల్లేశ్వర్ అన్నారు. కాకతీయ విశ్వవిద్యాలయం, దూరవిద్య కేంద్రం ప్రాంగణంలోని భారత రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బీఆర్ అంబేద్కర్ నిలువెత్తు విగ్రహానికి పూలమాల వేసి 42శాతం బీసీ రిజర్వేషన్లు అమలు చేయాలని వినతిపత్రం ఇచ్చారు.ఈ సందర్భంగా పాస్ రాష్ట్ర అధ్యక్షులు డాక్టర్ సంగని మల్లేశ్వర్ మాట్లాడుతూ రాజ్యాంగంలోని 38(1)వ అధికరణ ప్రజలందరి సంక్షేమాన్ని కోరిందని,78సంవత్సరాలుగా సామాజిక న్యాయం అందని ద్రాక్షగానే మిగిలిందని ఆవేదన వ్యక్తం చేసారు. తెలంగాణ ప్రభుత్వం రాజ్యాంగంలోని 285 (ఏ) సవరించి తెచ్చిన జీవో నెం '9' పై రెండు రోజులు వాదోపవాదనలు విని కొన్ని వర్గాలు మాత్రమే దైవాంశ సంభూతులుగా వర్ణించి,8శాతం లేని అగ్రవర్ణాలకు అనుకూలంగా హైకోర్టు 'స్టే' ఇచ్చి బీసీలకు రాజ్యాధికారం దూరం చేసే ప్రయత్నం చేసిందని అన్నారు, బీసీలను ఓటు బ్యాంకుగా చూస్తున్న రాజకీయ పార్టీలకు ప్రజాక్షేత్రంలో శిక్షించే రోజులు దగ్గరపడ్డాయని మండిపడ్డారు.ఇప్పటికైనా గవర్నర్ ను ఒప్పించే బాధ్యత బీజేపీ తీసుకోని,రిజర్వేషన్ల అమలుకు సహకరించాలని విజ్ఞప్తి చేసారు. ఈ



కార్యక్రమంలో పాస్ జిల్లా అధ్యక్షులు డాక్టర్ తాడూరి శాస్త్రి, రాష్ట్ర కార్యదర్శి డాక్టర్ చందా మల్లయ్య, జిల్లా కార్యదర్శి డాక్టర్ నల్లాని శ్రీనివాస్,పాస్ నాయకులు రుద్రోజు శ్యాం సుందర్, కర్ణకంటి సత్యనారాయణ, గుడాటి విజయ్ తదితరులు పాల్గొన్నారు.

# పార్క్ ను కబ్జాదారుల నుండి కాపాడండి

**వేద న్యూస్, కరీంనగర్:**

కరీంనగర్ పట్టణంలో నగరపాలక సంస్థలో ఉన్న పార్కులను కబ్జాదారుల నుడి కాపాడాలని, సాయి కృష్ణ థియేటర్ పక్కన ఉన్న పార్క్ ను కబ్జా నుండి కాపాడాలని నగరపాలక సంస్థలోకమీషనర్ కి పిర్యాదు చేయడం చేయడం జరిగింది. అనంతరం జిల్లా ప్రధాన కార్యదర్శి బండారి శేఖర్ మాట్లాడుతూ కరీంనగర్ నగర పాలక సంస్థలో పార్కు స్థలాల పరిరక్షణపై నగరపాలక సంస్థ అధికారులు దృష్టి సారించడం లేదని విమర్శించారు. కొన్ని సంద ర్భాల్లో కబ్జాదారులతో చేతులు కలసి స్థలాలు అన్యాక్రాంతం అయ్యేలా సహకరిస్తుండగా మరి కొన్ని సందర్భాల్లో అధికారుల నిర్లక్ష్యంగా కార ణంగా కోట్ల రూపాయల విలువ చేసే స్థలాలు చేజారిపోతున్నాయిని ఆందోళన వ్యక్తం చేశారు. తాజాగా సాయికృష్ణ తీయేటర్ సమీపంలో మరో పార్కుస్థలం. అన్యాక్రాంతమవుతున్నా అధికారులు చూసి చూడనట్లు వ్యవహరిస్తున్నారని విమర్శించారు. సాయికృష్ణ థియేటర్ పక్కన ముకరంపుర సర్వే:1101/డి, 1093 సర్వే నెంబర్లలోని 8 గుంటల స్థలాన్ని గతంలో పార్కు స్థలంగా చూపారు. ఈ మేరకు స్థలాన్ని అభివృద్ధిపరిచేందుకు గత పాలకవర్గ హయాంలో నిధుల ను కేటాయించి, టెండర్లను కూడా నిర్వహించారు. లే-అవుట్ నెంబర్:486/85 ముకరంపుర లోని పరకా కు రూ:7.30 లక్షలు కాంపౌండ్ వాల్ నిర్మించడానికి కేటాయించి, ఖర్చు చేశారు. దీన్ని కొంత మంది ప్రైవేట్ వ్యక్తులు కబ్జా చేశారని అన్నారు. అధికారులు మాత్రం నిమ్మకు నిరతినట్లు ఉన్నారని విమర్శించారు. నగరపాలక సంస్థ అధికారులు గతంలో పార్కుల జాబితాను విడుదల చేశారు. మొదట 120 వరకు ఒక జాబితా ఉండగా రెండవసారి విడుదల చేసిన జాబితాలో 58 పార్కు స్థలాలు మూడోసారి విడుదల చేసిన పార్కు జాబితాలోతో 38 వరకు ఉన్నాయి. నగరపాలక సంస్థలో పార్కు స్థలాలు రోజురోజుకు తగ్గుతూ పోతున్నాయి. నగరంలోని పార్కు స్థలాలను కాపాడాల్సిన అధికారులు కబ్జాదారుల, ప్రైవేటు వ్యక్తులకు షార్కు స్థలాలను దారాదత్తం సేందుకు మున్సిపల్ అధికారులు ఆసక్తి చూపుచూ పెద్ద మొత్తంలో ముడుపులు తీసుకోవడం వల్ల ఇది జరుగుతుందని అనుమానం వ్యక్తం చేశారు.నగర పాలక సంస్థ అధికారుల నిర్లక్ష్యం, వైఫల్యం ఫలితంగా 8 కోట్ల రూపాయల పైగా విలువ చేసే పార్కు స్థలం కళ్ల ముందే కబ్జాదారులు షెడ్ వేసుకొని కబ్జా చేయడం జాగింది. ఇప్పటికైనా కమీషనర్ గారు చొరవ తీసుకొని



కబ్జా గురవుతున్నటువంటి పార్కు స్థలమును కాపాడాలని డిమాండ్ చేశారు. లేదంటే తమ పార్టీ ఆధ్వర్యంలో ఆందోళన చేస్తామని హెచ్చరించారు.

ఈ కార్యక్రమంలో యూత్ లీగ్ రాష్ట్ర కన్వీనర్ ఆదిత్య, అల్ ఇండియా ఫార్వర్డ్ బ్లాక్ జిల్లా కమిటీ సభ్యులు బద్రి నేత, జిల్లా నాయకులు వేణు, సాయి , సాయి కిరణ్ రెడ్డి , రాహుల్ తదితరులు పాల్గొన్నారు.

వేద న్యూస్

శనివారం అక్టోబర్ 11, 2025

# సంపాదకీయం

ఓటమి కాదు – నిర్ణయం మనల్ని గెలిపిస్తుంది

– దారి కష్టం అయినా పరవాలేదు మనలో ఉన్న అగ్ని చాలని

– ప్రపంచం గుర్తించకపోయినా పరవాలేదు

– మనం మనల్ని గుర్తించడం మొదలు పెడదాం

– అవకాశాల కోసం ఎదురుచూడొద్దు.. ఎదురొచ్చే కష్టాన్నే అవకాశం చేసుకో

– జీవితం అడిగేది అదృష్టం కాదు – ఒక్క అడుగు ముందుకు వేసే ధైర్యం

జీవితం అన్నది ఎప్పుడూ సూటిగా వెళ్లే రహదారి కాదు. కొన్ని మలుపులు మనం ఊహించని విధంగా ఉంటాయి. కొన్నిసార్లు మనం సిద్ధంగా లేకపోయినా ప్రయాణం కఠినంగా మారుతుంది. కష్టాలు వస్తాయన్న భయం మనల్ని వెనక్కి లాగుతుంది. కానీ ఒక నిజం మాత్రం మర్చిపోవద్దు ౹ మనల్ని ఓడించేది సమస్య కాదు, మన మనసులో పెరిగిన భయమే. ప్రతి మనిషి తన జీవితాన్ని మార్చే శక్తి తనలోనే ఉంచుకున్నాడు. కానీ ఆ శక్తి బయటకు రావాలంటే ఒక చిన్న అడుగు, ఒక సాహసమనోభావం, ఒక "నేను చేయగలను" అనే నమ్మకం చాలిస్తుంది. ఈ ప్రపంచంలో సాదారణంగా కనిపించే గొప్పవారు అందరూ మొదట్లో భయపడిన వారే. తేడా ఒక్కటే ౹ వారు భయంతో ఉన్నా అడుగు వేశారు, కానీ చాలామంది భయపడి మొదలే పెట్టలేదు.

మనసులో కల ఉండటం ఒకటి, ఆ కలను సాధించడానికి కదలటం వేరు. లక్షల మంది కలలు కనగలరు, కానీ కదిలేవారే చరిత్రలో నిలుస్తారు. ఇతరుల అభిప్రాయాల వల్ల, పరిస్థితుల ఒత్తిడి వల్ల, గత విఫలాల బాధ వల్ల మన పయనం ఆగిపోకూడదు. ఎందుకంటే జీవితం అంటే గెలుపు కోసమే కాదు, పోరాటం నేర్చుకోవడం కోసం కూడా. ఓటమి రుచి తెలియని మనిషి విజయపు విలువను ఎప్పుడూ అర్థం చేసుకోలేడు. ప్రతి సారి మనం పడిపోతే, అది అంతం కాదు ౹ అది మళ్లీ లేవడానికి వచ్చే అవకాశం. ఆ అవకాశం గుర్తించగలిగిన వాడే నిజంగా బలవంతుడు.

మనకు ఎన్ని సార్లు అవకాశాలు రాకపోయినా, ప్రపంచం మనల్ని గుర్తించకపోయినా, మనం మనల్ని వదిలేసే హక్కు మనకుండదు. ఎందుకంటే మన పై నమ్మకంతో మరొక చిన్న జీవితం మన చుట్టూ తిరుగుతూ ఉంటుంది ౹ అది కుటుంబమై ఉండొచ్చు, మన కలల రూపమై ఉండొచ్చు, మన కొద్దిపాటి ఆశల రూపమై ఉండొచ్చు. చాలామంది తమ జీవితాన్ని పోల్చుకోవడంలోనే కాలం గడిపేస్తారు. "అతనికి అదృష్టం ఉంది", "అయన పరిస్థితి వేరు", "నాకు అండగా ఎవరూ లేరు" ౹ ఇవన్నీ మన మనసులో పుట్టే సాకులు మాత్రమే. నిజం చెప్పాలి అంటే, విజయం అంటే వాతావరణం కాదు, నిర్ణయం. వాతావరణం అనుకూలం కాకపోయినా ముందుకు సాగినవాళ్ళే ఈ ప్రపంచాన్ని మార్చారు. మన మదిలో ఒకసారి అగ్ని రగిలితే, ఎదుట ఉన్న కొండ కూడా పర్వతం కాదు, కేవలం ఎక్కాల్సిన దారి మాత్రమే అయిపోతుంది.

కష్టాలు వచ్చినప్పుడు మనం ఎందుకు వెనక్కి తగ్గుతాం? ఎందుకంటే మనం వాటిని శత్రువుల్లా చూస్తాం. కానీ లోతుగా ఆలోచిస్తే కష్టం అనేది మనల్ని నిలిపి వేయడానికి కాకుండా, మనల్ని పరిక్షించి మరింత బలంగా మలచడానికి వచ్చిన ఒక అద్భుత శక్తి. వాగులో ప్రవహించే నీళ్లు ప్రశాంతంగా ఉన్నప్పుడే మనం అందంగా కనిపిస్తాయి ౹ కానీ అదే నీటిని ఎదురుగా ఒక పెద్ద రాయి ఆపితే ఆ నీరు శబ్దం చేస్తూ, బలం పెంచుకుంటూ, తన శక్తిని బయటకు తీశి ప్రవాహంగా మారిపోతుంది. మన జీవితాల్లో వచ్చే సమస్యలు కూడా అలాంటి రాళ్ళే. అవి మన ప్రవాహాన్ని ఆపడానికి కాదు, మనల్ని మరింత శక్తివంతంగా ముందుకు దూకించడానికి. మనం కష్టాన్ని శత్రువుగా చూస్తే అది బలంగా కనిపిస్తుంది. దానిని ఉపాధ్యాయుడిగా చూస్తే అది ఒక తీర్చిదిద్దే శక్తిగా మారుతుంది. మనకెప్పుడూ గుర్తుంచుకోవలసిన విషయం ఏమిటంటే, ఓటమి అన్నది మనలను మట్టి కరిపెట్టడానికి రాదు. అది వచ్చేది మన గుండెలో దాగి ఉన్న అసలు ధైర్యాన్ని బయటకు తీయడం కోసం. విజయవంతమైన ప్రతి మనిషి లోపల ఒక మూమెంట్ ఉంటుంది ౹ ఆ క్షణం వారే వారిని చూసి "ఇదెలా వచ్చినా నేను పోరాడతా" అని నిర్ణయించుకున్న సమయం. అదే నిర్ణయం అన్నింటిని మార్చుతుంది. మనం మారాలంటే ప్రపంచం మారాల్సిన అవసరం లేదు, మనలోని ఆ ఒక్క మాట ౹ "నేను సిద్ధం" ౹ చాలు. ఒకసారి మనలో ఆ నిర్ణయం మంటలా రగిలితే, మన ప్రయాణాన్ని ఎవరూ ఆపలేరు. ఎందుకంటే అప్పుడు మనం గెలుపుకోసం కాకుండా, మనసాక్షి కోసం నడుస్తుంటాం... ఆ ప్రయాణం ఎప్పటికీ పరాజయం చూడదు.

# తెలంగాణ రాజకీయాల్లో ఉద్రిక్తత




ఆటంకాలు ఇవన్నీ ప్రతిపక్ష వాగ్దాటికి బలం చేకూరుస్తున్న అంశాలుగా మారాయి. అధికార పార్టీ మాత్రం "అభివృద్ధి పథకాల జాబితా ఎంత ఉందో చూడండి" అంటూ తన ప్రచార రంగాన్ని విస్తరించింది. కాని ప్రక్షాళన చేసిన గణాంకాలు, నేలమీద ఉన్న వాస్తవ పరిస్థితులు సమానంగా లేవని విశ్లేషకుల అభిప్రాయం. రాష్ట్ర ఆర్థిక పరిస్థితి కూడా రాజకీయ వేదికపై ప్రధాన చర్చగా మారింది. కేంద్రంతో ఆర్థిక సంబంధాలు, నిధుల విడుదల, అప్పుల పరిమితి అనే అంశాలు, ఇప్పుడు రాజకీయాల కంటే పెద్ద అంశాల్లా కనిపిస్తున్నాయి. శాసనసభలో జరుగుతున్న వాదోపవాదాల కన్నా, బయట ప్రజా వేదికలపై మాట్లాడే మాటలే ఎక్కువ ప్రభావం చూపుతున్నాయి. సోషల్ మీడియా ప్రచారం కూడా ఇదే దిశలో యుద్ధం లా సాగుతోంది.

ఒకవైపు ప్రభుత్వం తన సంక్షేమ పథకాల జాబితా చూపిస్తూ "తెలంగాణ మోడల్"ను ముందుకు నెడుతుంటే, మరోవైపు ప్రతిపక్షం "వాస్తవ తెలంగాణ ప్రజల జీవన స్థితి"పై దృష్టి పెట్టాలని కోరుతోంది. రానున్న రోజుల్లో ఆక్షేపణలు, ఆందోళనలు, సభలు మరియు మీడియా మౌలికాల్లో కఠిన పోటీ ఏర్పడే అవకాశం స్పష్టంగా కనిపిస్తోంది. ప్రజల ఓటు హక్కు కోసం కంటే భావోద్వేగాల కోసం కూడా ఇప్పుడు రాజకీయ యుద్ధం సిద్ధమవుతోంది. ఎన్నికల వేళ సమయం దగ్గరవుతున్న కొద్దీ రాజకీయ మంటలు మరింత రగులుతున్నాయి. మాటల యుద్ధం, ఆరోపణల మార్పిడి, సభల గర్జనలు ఇవన్నీ ప్రజా దృష్టిని ఆకర్షించే ప్రయత్నాలే. కానీ ఈ రాజకీయ ఆడపాటకు అసలు న్యాయాధిపతులు పార్టీ నాయకులు కాదు, సభ లో కూర్చున్న సభ్యులు కాదు – ప్రతి ఓటు కేంద్రంలో నిలబడ్డ సామాన్య పౌరుడే. ఎన్నికల వేడిలో మాటలు శబ్దాలై వినిపించవచ్చు, కాని ఓటు పత్రంలో పడే ఒక్క గుర్తే భవిష్యత్ దిశను నిర్ణయిస్తుంది.

ప్రభుత్వం తీసుకుంటున్న నిర్ణయాలపై ప్రతిపక్షం ఘాటుగా విమర్శలు చేస్తూ, ప్రజల్లో ఆగ్రహం మేల్కొలిపే ప్రయత్నం చేస్తోంది. ముఖ్యంగా ఎన్నికల షెడ్యూల్, ఆర్థిక క్షీణత మరియు పరిపాలనా వ్యవస్థలో ఉన్న గందరగోళం రాజకీయ చర్చకు కేంద్ర బిందువుగా మారాయి. ప్రజల దృష్టి ఇప్పుడు శాసనసభ వెలుపలి మాటల కన్నా, ప్రభుత్వ పనితీరు పైనే ఉండటం గమనార్హం. మరోవైపు, అధికార పార్టీ తన అభివృద్ధి కార్యక్రమాలను పత్రికా గోడల మీద, సోషల్ మీడియా ద్వారా విస్తృతంగా ప్రచారం చేస్తూ, ప్రజల నమ్మకం నిలబెట్టుకునే వ్యూహాన్ని అవలంబిస్తోంది. అయితే నేలస్థాయిలో పరిస్థితి వేరు అని విమర్శకులు అంటున్నారు. ధాన్యం కొనుగోలు, నిరుద్యోగ భృతి, బీసీ జనగణన, రాష్ట్ర ఆర్థిక వ్యవస్థ – ప్రతి అంశం ఇప్పుడు రాజకీయ వేదికపై రగులుతోంది. ఎన్నికల ముందు ఇది ఒక రాజకీయ తుపాను ప్రారంభమని పలువురు విశ్లేషకులు భావిస్తున్నారు.

# నల్గొండలో గిరిజన రైతుపై అమానుషం

కావాల్సిన ఎరువులు సమయానికి అందలేదని ప్రశ్నించిన సాయి సిద్దును స్టేషన్‌కు తీసుకెళ్లి కొట్టినట్లు గ్రామస్తులు చెబుతున్నారు. గ్రామంలోని రైతులు చెబుతున్న వివరాల ప్రకారయస్టేషన్‌కి పిలిపించిన తరువాత పోలీసు సిబ్బంది అతనిపై థర్డ్ డిగ్రీ ప్రయోగించారని, చేతులు కట్టివేసి దారుణంగా దేహదండనకు గురిచేశారని సమాచారం. అంతేకాదు, విచారణ పేరుతో అతని భార్యను కూడా కులపేరు చెప్పి దూషించారనే ఆరోపణలు వెలువడ్డాయి. కుటుంబం భయాందోళనలో ఉండగా, ఈ ఘటన సామాజిక వర్గాల్లో తీవ్ర ఆగ్రహాన్ని రేపింది. సామాజికవేత్త రేవంత్ ఈ ఘటనపై జాతీయ మానవ హక్కుల కమిషన్‌కు ఫిర్యాదు చేయడంతో కేసు కొత్త మలుపు తిరిగింది. ఫిర్యాదు స్వీకరించిన కమిషన్ వెంటనే స్పందించి, తొలి దశ విచారణ అనంతరం ఎస్ఐ శ్రీకాంత్ రెడ్డి, ఒక కానిస్టేబుల్‌పై తక్షణ సస్పెన్షన్ విధించాలని జిల్లా ఎస్పీకి ఆదేశాలు జారీ చేసింది. బాధిత కుటుంబానికి రక్షణ కల్పించాలని, పోలీస్ స్టేషన్ వ్యవహారశైలిపై ప్రత్యేక దర్యాప్తు కమిటీ నియమించాలని కూడా సూచించింది. గ్రామస్తులు ఈ ఘటనను "పోలీసుల అధికారం దుర్వినియోగానికి నిదర్శనం"గా అభివర్ణిస్తున్నారు. రైతు సంఘాలు, గిరిజన సంఘాలు పెద్ద సంఖ్యలో సంఘీభావం ప్రకటించేందుకు సిద్ధమవుతున్నాయి. న్యాయం జరిగే వరకు వెనక్కి తగ్గేది లేదని వారంటున్నారు. బాధితుడు సాయి సిద్దు ఇంకా తీవ్ర భయంతో ఉన్నాడు. "నేను రైతుని నేరస్థుడిని కాదు నా పంట కోసం ఎరువు అడిగాను, అందుకే ఇలా చేశారు," అని అతని వేదన చెప్పకనే చెబుతోంది.

ప్రస్తుతం జిల్లా పోలీసు వ్యవస్థపై విమర్శల వర్షం కురుస్తోంది. మానవ హక్కుల ఉల్లంఘనగా ఈ ఘటన నమోదు అయిన నేపథ్యంలో, పోలీసు వ్యవస్థలో సంస్కరణల అవసరంపై మళ్లీ చర్చ మొదలైంది. అధికార యంత్రాంగం స్పందనపై రాష్ట్రవ్యాప్తంగా చూపులు నిలిచాయి.

**– మానవ హక్కుల కమిషన్ తక్షణ చర్య**

సామాజికవేత్త రేవంత్ ఫిర్యాదు అనంతరం జాతీయ మానవ హక్కుల కమిషన్ దృష్టి సారించింది. విచారణ అనంతరం ఎస్ఐ శ్రీకాంత్ రెడ్డి, కానిస్టేబుల్‌పై విధుల నుండి తొలగింపు ఆదేశాలు జారీ చేసింది. బాధిత కుటుంబాన్ని రక్షించాలని, స్టేషన్‌పై ప్రత్యేక దర్యాప్తు కమిటీ నియమించాలని కమిషన్ స్పష్టమైన ఆదేశాలు ఇచ్చింది. "ఎరువు అడిగితే చితకబాదుతారా? రైతు తప్పు ఏమిటి?" అంటూ రైతు సంఘాలు ప్రశ్నిస్తున్నాయి. గిరిజన సంఘాలు పెద్ద ఎత్తున ఆందోళనకు సిద్ధమవుతున్నాయి. "మానవ హక్కుల కంటే పోలీసుల అధికారం పెద్దదా?" అనే ప్రశ్న సామాజిక వర్గాల్లో వినిపిస్తోంది.

# నిషేధించిన యూట్యూబర్లకు రెండవ అవకాశం..

డెస్క్ : నిషేధించిన యూట్యూబ్ ఛానెల్‌కు రెండవ అవకాశం ఇవ్వనున్నట్లు కంపెనీ ప్రకటించింది. గతంలో నిషేధించిన సృష్టికర్తలు కొత్త ఛానెల్ కోసం దరఖాస్తు చేసుకోవడానికి అనుమతించే కొత్త ఫీచర్‌ను ప్రారంభిస్తున్నట్లు యాజమాన్యంలోని ప్లాట్‌ఫామ్ వెల్లడించింది. అయితే కాపీరైట్ ఉల్లంఘన, క్రియేటర్స్ బాధ్యత విధానాన్ని ఉల్లంఘించిన వారికి మాత్రం షరతులు వర్తిస్తాయని తెలిపింది. కంపెనీ పాత నియమాల ఫలితంగా సృష్టికర్తలకు జీవితకాల నిషేధం విధించడం జరిగింది. ఈ నియమాలను ఇప్పుడు మారుస్తున్నారు.తన బ్లాగులో, చాలా మంది తొలగించిన యూట్యూబర్లకు రెండవ అవకాశం ఇవ్వనున్నట్లు పేర్కొంది. ఈ సృష్టికర్తలకు కొత్త అవకాశం ఇవ్వడంతో పాటు ప్లాట్‌ఫామ్‌లో వారి అభిప్రాయాలను వ్యక్తపరచడానికి అవకాశం ఇవ్వనున్నట్లు తెలిపింది. కొత్త ఫీచర్ కింద, మహమ్మారి, ఎన్నికల సమయంలో తప్పుడు సమాచారాన్ని వ్యాప్తి చేసినందుకు నిషేధించిన సృష్టికర్తలకు కొత్త ఛానెల్‌ను సృష్టించే అవకాశం ఇవ్వనున్నట్లు తెలిపింది. అయితే, ఒక సంవత్సరం నిషేధం పూర్తి చేసిన ఛానెల్‌ల సృష్టికర్తలకు మాత్రమే కొత్త ఛానెల్‌ను సృష్టించే అవకాశం దక్కనుంది. అటువంటి సృష్టికర్తలకు రాబోయే రోజుల్లో స్టూడియోలో కొత్త ఛానెల్‌ను సృష్టించే అవకాశం కనిపిస్తుంది. నిషేధించిన సృష్టికర్తలకు రెండవ అవకాశం ఇస్తోంది. కానీ కాపీరైట్ ఉల్లంఘన, క్రియేటర్స్ బాధ్యత విధానాన్ని ఉల్లంఘించిన కారణంగా నిషేధించిన ఛానెల్‌ల సృష్టికర్తలకు కొత్త నియమాలు ఉపశమనం కలిగించవు. ఇంకా, ఇప్పటికే తమ ఛానెల్‌లను తొలగించిన సృష్టికర్తలు కొత్త నిబంధనల నుండి ప్రయోజనం పొందరు. ఈ తాజా నిర్ణయం , ఇతర కంపెనీలు తమ నియమాలను సడలిస్తున్న ధోరణిలో భాగం. 19 మహమ్మారి, 2020 అధ్యక్ష ఎన్నికల సమయంలో పుకార్లు, తప్పుడు సమాచారం వ్యాప్తి చెందకుండా నిరోధించడానికి ఈ కంపెనీలు తమ నియమాలను కఠినతరం చేశాయి.

# పసిడి ప్రియులకు గుడ్ న్యూస్.. తగ్గిన బంగారం ధర..

ఇటీవల బంగారం ధరకు రెక్కలొస్తున్నాయి. గోల్డ్ రేటు ఆకాశం వైపు దూసుకెళ్తుంది. సామాన్యులకు దొరకనంత ఎత్తుకు బంగారం ధర వెళ్తోంది. గత కొన్ని రోజులుగా బంగారం ధరలు ఏ మాత్రం తగ్గడం లేదు. ఇంకా చెప్పాలంటే బంగారం అంటేనే మహిళలు బయపడే రోజులు వచ్చాయి. డాలర్‌తో పోల్చుకుంటే రూపాయి క్షీణిస్తుండడం కూడా బంగారం పెరుగుదలకు కారణంగా కనిపిస్తోంది. అయితే నేడు మాత్రం పసిడి ప్రియులకు గుడ్ న్యూస్ అనే చెప్పాలి. ఇటీవల దూసుకెళ్తున్న బంగారం ధరకు కాస్తా బ్రేకులు పడ్డాయి. వివిధ నగరాల్లో రూ.వెయ్యి మేర బంగారం తగ్గింది. ఇదే సమయంలో వెండి ధర దాదాపు మూడు వేలు పెరిగింది. ఇక నేటి బంగారం, వెండి ధరల ఎలా ఉన్నాయో ఇప్పుడు చూద్దాం... శు క్రవారం (అక్టోబర్ 10న) హైదరాబాద్ లో 24 క్యారెట్ల 10 గ్రాముల బంగారం ధర రూ. 1,22,290 పలికింది. 22 క్యారెట్ల 10 గ్రాముల బంగారం ధర రూ. 1,13,800 పలికింది. అలానే 18 క్యారెట్ల 10 గ్రాముల బంగారం ధర రూ.91,720 గా ఉంది. ఒక కేజీ వెండి ధర రూ. 1,80,000 పలికింది. బంగారం ధర నేడు భారీగా పెరిగింది. అలానే ఢిల్లీలో 24 క్యారెట్ల పసిడి రేటు 10 గ్రాములకు రూ.1, 22,440కి చేరుకోగా, 22 క్యారెట్ల గోల్డ్ ధర 10 గ్రాములకు రూ. 1, 12, 200 పలికింది. బంగారం ధరలు నిన్నటి తో పోల్చుకుంటే వెయ్యి రూపాయల మేర తగ్గాయి. ఈ క్రమంలో దేశంలోని ప్రధాన నగరాల్లో ఉన్న బంగారం, వెండి రేట్లను ఇప్పుడు తెలుసుకుందాం.



దేశంలోని ప్రధాన నగరాల్లో బంగారం రేట్లు (10 గ్రాములకు) (24 క్యారెట్, 22 క్యారెట్), విజయవాడలో రూ. 1, 24, 160, రూ. 1, 13, 810, ముంబైలో రూ. 1, 22, 290, రూ. 1, 12, 100, కోల్‌కతాలో రూ.1,22,290, రూ.1,12,100, చెన్నైలో రూ. 1,22,840, రూ.1,12,600, బెంగళూరులో రూ. 1,22,290, రూ. 1,12,100, కేరళలో రూ. 1,22,290, రూ. 1,12,100, ప్రధాన నగరాల్లో వెండి ధరలు (కేజీకి), విజయవాడలో రూ. 1,80,000, ఢిల్లీలో రూ. 1,70,000, చెన్నైలో రూ. 1, 70, 010, కోల్‌కతాలో రూ. 1,70,000, కేరళలో రూ. 1,80,000, ముంబైలో రూ. 1,70,000, బెంగళూరులో రూ. 1,70,000

Edited, Printed, Published and Owned by Lingabatthini Krishna Printed at Bhavani Enterprises, H.No 16-6-198/B, Perukawada, Warangal, 506002, Telangana State. Published at H.No. 17-3-180, Near Rama Swamy Temple, Warangal Dist, 506002 Telangana State. Editor : Lingabatthini Krishna, Phone : 9701923260. e-Mail : vedhanews22@gmail.com. RNI No : TELTEL/2022/83073